సాక్షి సిద్దిపేట

ఆదివారం : 11 : ఆగస్టు : 2024



లారీ బీభత్సం

గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొడకండ్ల వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు 8లో ▸




ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం

ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. వివరాలు 9లో ▸

నేడు పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్ శనివారం తెలిపారు. సివిల్ బ్రాంచిలో 15, ఈఈఈలో 7 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. సీట్లు పొందిన విద్యార్థులు రూ.5,080లు కౌన్సెలింగ్ ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు.



శ్రీమంతులు

సొంతూరు రుణం తీర్చుకుంటున్నారు

సండే స్పెషల్

"ఊరి నుంచి చాలా తీసుకున్నారు.. తిరిగి ఇచ్చేయాలి". ఇది శ్రీమంతుడు సినిమాలోని పాపులర్ డైలాగ్. మాతృభూమికి ఏదో రూపేణ రుణం తీర్చుకోవాలనేది దీని సారాంశం. అందుకు తగ్గట్లుగానే జిల్లాకు చెందిన కొందరు ప్రముఖులు మాతృభూమి సేవలో తరిస్తున్నారు. ఈ గడ్డ మీద పుట్టి విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం, వ్యాపారం చేస్తూ ఉన్నత స్థాయికి ఎదిగారు. సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయినా.. ఏదో వెలితి. పుట్టిన ఊరికి ఏదైనా చేయాలనే తపన. అదే వారిని పల్లె బాట పట్టించింది. సొంతూరు రుణం తీర్చుకునేలా చేసింది. కేవలం డబ్బులు సంపాదించడమే కాదనీ.. మాతృభూమి రుణం తీర్చుకోవడంలోనే ఆనందం, సంతృప్తి ఉంటుందని నిరూపిస్తున్నారు సిద్దిపేట బిడ్డలు. జిల్లాకు చెందిన పలువురు చేస్తున్న సేవా కార్యక్రమాలపై ఈ వారం సాక్షి ప్రత్యేక కథనం..

- సాక్షి, సిద్దిపేట/ నంగునూరు/ చేర్యాల/ సిద్దిపేట రూరల్/ బెజ్జంకి :

- సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారస్తులు, విశ్రాంత ఉద్యోగులు
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి
- ఉచితంగా ఎకరాల్లో స్థలాలు అందజేత
- గ్రంథాలయాలు, తరగతి గదుల నిర్మాణం
- ఆపదలో ఉన్నవారికి ఆర్థికసాయం

- వివరాలు 8లో..

కాళేశ్వరమే కాంగ్రెస్‌కు దిక్కయింది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందంటూ అబద్ధపు ప్రచారం చేసిన కాంగ్రెస్.. నేడు అందులో నుంచే నీరు వదులుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరంలోని అన్ని చెరువులను నింపుతామన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లూరులో కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారనున్నాయన్నారు. ప్రాజెక్టు కొట్టుకుపోయిందని కుంగిపోయిందని, రూ. లక్ష కోట్లు దుర్వినియోగం జరిగాయని కాంగ్రెస్ ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందన్నారు. ఇప్పుడు రంగనాయక సాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల్లో కాళేశ్వరం నీళ్లే వస్తున్నాయన్నారు. త్వరలో గ్రామంలో పెండింగ్‌లో ఉన్న కాలువల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్నూరు కాపు సంఘం నాయకులు దేశెట్టి తిరుపతి, ఒగ్గు మురళి, రామచంద్రం, ఆంజనేయులు, కనకయ్య, ఆలయ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఒగ్గులచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వినతి

తమకు 7 నెలలుగా జీతాలు రావడం లేదంటూ పారిశుద్ధ్య సిబ్బంది అన్నారు. ఆ మేరకు పుల్లూరుకు వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని అన్నారు.

కాంగ్రెస్ పాలనలో సీన్ రివర్స్

సిద్దిపేటజోన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సీన్ రివర్స్‌గా మారిందని, స్వచ్ఛ గ్రామాలు అన్ని నేడు పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో చెత్త కుప్పలుగా మారారని, ఊర్లో ప్రజలను కుక్కలు, హాస్టళ్లలో విద్యార్థులను ఎలుకలు కోరుకుతున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఎద్దేవా చేశారు. శనివారం సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెవిటి వారి ముందు శంఖం ఊదినట్టు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిలదీసినా స్పందన లేదన్నారు. పట్టణాల్లో, పల్లెల్లో సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాలకు నిధులు లేక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం మాట దేవుడెరుగు కానీ కేసీఆర్ ఇచ్చిన లక్ష సాయం సరిగా అందడం లేదని ఆరోపించారు. అబద్ధాలు, మోసం మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.5 వేల కంటే ఎక్కువగా రూ.7,500లను రైతు భరోసా కింద ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, నేటికీ దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎగవేత, కోతల సర్కారుగా అభివర్ణించారు.

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్



మల్లన్న ఆలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. తన కార్యాలయం నుంచి ఆలయం వరకు కాలినడకన వచ్చారు. స్వామికి మొక్కు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ అర్చకులు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరి సేవలో అటవీశాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి



వర్గల్ అమ్మవారి సన్నిధిలో ప్రశాంతి దంపతులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రాన్ని శనివారం అటవీ శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి ప్రశాంతి దంపతులు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ వర్గాలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక అర్చన అనంతరం ఆలయ అర్చకులు మహదాశీర్వచనం చేశారు. శేషవస్త్రంతో సన్మానించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

జల్‌జీవన్ మిషన్ ప్రతినిధుల పర్యటన



తోటపల్లిలో తాగునీటిని పరీక్షిస్తున్న కేంద్ర జలజీవన్ మిషన్ సభ్యులు రమేశ్, సాహెబ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో శనివారం కేంద్ర జల్‌జీవన్ ప్రతినిధులు రమేశ్, సాహెబ్‌లు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ నీరు గురించి తెలుసుకున్నారు. తాగునీటిని పరీక్షించారు. కార్యక్రమంలో డీఈ వీణ తస్కిన్, కార్యదర్శి సురేశ్, మాజీ సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగారావు, నర్సయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల పరేషాన్

- పెండింగ్‌లో పాల బిల్లులు
- జూన్ నుంచి రావాల్సినవి రూ.9.60 కోట్లు
- నాలుగేళ్లుగా అందాల్సిన ప్రోత్సాహకం రూ.18.43 కోట్లు
- నిరాశలో విజయ డెయిరీ పశు పోషకులు



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విజయపాలడెయిరీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెండున్నర నెలలుగా ప్రభుత్వ రంగ విజయ డెయిరీ పాడి రైతులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 12 వేల మంది పాడి రైతులు ఉండగా, ఇందులో 6వేల మంది పాడి రైతులు రోజూ 32వేల లీటర్ల పాలను విజయ డెయిరీకి విక్రయిస్తున్నారు. అందుకు గాను 360 పాల సేకరణ కేంద్రాలు ఉండగా, 17 పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. తద్వారా సిద్దిపేట జిల్లా విజయ డెయిరీకి పాలను సరఫరా చేస్తారు. ఇక్కడ రోజూ 5 వేల లీటర్ల పాలను ప్యాకెట్‌ల ద్వారా విక్రయిస్తారు. మిగిలిన పాలను హైదరాబాద్‌లోని విజయడెయిరీకి తరలిస్తున్నారు. ఈ డెయిరీ పాలు లీటరుకు రూ.40లు చెల్లిస్తుండగా, ఇతర డెయిరీలు మాత్రం లీటరుకు రూ.32 మాత్రమే చెల్లిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ డెయిరీకి పాలను విక్రయించేందుకు పాడి రైతులు ముందుకు వచ్చారు. దీంతో పాల సేకరణ సామర్థ్యం పెరిగింది. అయితే జూన్ నుంచి పాడి రైతులకు మాత్రం డబ్బులు రావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ పాడి పోషణ కష్టతరంగా మారుతుందని, అందువల్లే వెంటనే పాల డబ్బులు విడుదల చేయాలని వారు పలు చోట్ల నిరసనలు చేస్తున్నారు. రోజుకు 32వేల లీటర్లకు గాను లీటర్ పాలకు రూ.40 చొప్పున రూ.12.80 లక్షలను చెల్లించాల్సి ఉంది. దీనికి గాను రెండున్నర నెలలుగా పాడి రైతులకు రూ.9.60 కోట్లు చెల్లించాల్సి ఉంది. రావాల్సిన డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

ప్రైవేట్ డెయిరీల వైపు.. పాడి రైతుల చూపు

రెండున్నర నెలలుగా పాడి రైతులకు పాలకు రావాల్సిన డబ్బులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ డెయిరీలో పాల సేకరణ ధర తక్కువగా ఉన్నప్పటికి ప్రతీ 15 రోజులకోసారి బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో విజయ డెయిరీకి పాలు విక్రయిస్తున్న పాడి రైతులు పాలను ప్రైవేట్ డెయిరీలకు విక్రయించేందుకు ముందుకు సాగుతున్నారు. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీ పాల సేకరణ సామర్థ్యం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ 15 రోజులలో బిల్లులు రాకుంటే వచ్చే నెల నుంచి ప్రైవేట్ డెయిరీలకు పాలను విక్రయిస్తామని, పాడి రైతులు బహిరంగంగానే చెబుతున్నారు.

నాలుగేళ్లుగా పాల ప్రోత్సాహక డబ్బులేవీ?

పాడిరైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ప్రోత్సాహకంగా ప్రతీ లీటర్‌కు రూ. 4 అదనంగా చెల్లిస్తోంది. కానీ ఈ పంపిణీ సక్రమంగా జరగడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. 2020 ఆగస్టు నెల నుంచి అందవలసిన ప్రోత్సాహకం డబ్బులు అందడం లేదని తెలుపుతున్నారు. నాలుగు సంవత్సరాలుగా రూ.18.43 కోట్లు అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలోని పాడి రైతులు నిరాశతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెల్లించిన మాదిరిగా ప్రోత్సాహకం చెల్లించడంలో జరుగుతున్న జాప్యం ఎందుకో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పాడి రైతులకు ప్రోత్సాహకం అందించాలని పాడి రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వాస్తవమే...



పాడి రైతులకు గత రెండున్నర నెలలుగా పాల విక్రయ డబ్బులు అందలేదు. నాలుగు సంవత్సరాలుగా పాడి రైతులకు అందించాల్సిన రూ.4 ప్రోత్సాహక డబ్బులు అందాల్సి ఉంది. వివిధ కారణాలతో డబ్బుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు విడుదల చేయగానే, రైతులకు డబ్బులు అకౌంట్‌లలో జమ అవుతాయి.

- శరణ్యరెడ్డి, ఇన్‌చార్జి విజయ డెయిరీ మేనేజర్, సిద్దిపేట

కరెంట్ లేదంటూ ఫిర్యాదు రాకూడదు

మంత్రి పొన్నం ప్రభాకర్



కరెంట్ కోతపై మల్లంపల్లి విద్యుత్ శాఖ ఏఈ హరీశ్‌రెడ్డిని అడుగుతున్న మంత్రి పొన్నం

అక్కన్నపేట(హుస్నాబాద్): మల్లంపల్లి గ్రామంలో తరుచూ రాత్రి 10 గంటల సమయంలో సార్.. ఊరిలో కరెంట్ లేదంటూ పలువురు ఫోన్లు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అక్కన్నపేట మండలం రామవరం, మల్లంపల్లి గ్రామాల్లోని రైతు వేదికల్లో శనివారం వ్యవసాయ, అనుబంధ రంగాల పథకాలపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్య తలెత్త డానికి కారణాలు ఏమిటని ఏఈ హరీశ్‌రెడ్డిని అడిగారు. కొన్ని రోజులుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లల్లో తలెత్తిన సాంకేతిక లోపాలుతో కరెంట్ పోయిందని, ప్రస్తుతం మరమ్మతులు చేయించామన్నారు. రేపటి నుంచి కరెంట్ పోయిందంటూ ఫోన్లు వస్తే ఊరుకునేది లేదన్నారు. అలాగే పాడి పశువుల పోషణ, చేపలు పెంపకం, పండ్ల తోటలు, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, పట్టు పరిశ్రమ, కోళ్ల పెంపకం తదితర వాటికి దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు మంత్రి తెలిపారు. పెట్టుబడి తక్కువగా ఉండి అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల రుణమాఫీ కాకపోతే వెంటనే వ్యవసాయ అధికారులు స్పందించాలన్నారు. వచ్చే వారం రోజుల్లో రూ.2లక్షల రుణమాఫీ కాబోతోందన్నారు. హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎంపీడీఓ భానోతు జయరాం, వ్యవసాయ అధికారులు నాగరాజు, ఏఈఓలు శ్రీలత, నబియా, సింధూజ, శేఖర్, ఎంపీఓ కవికుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వ్రత నాచగిరి

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలతో అలరారింది. క్యూలైన్లలో కిక్కిరిసిన జనంతో క్షేత్రం కిటకిటలాడింది. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కల్యాణాలు, నిజాభిషేకాలతో సన్నిధానంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. శ్రావణమాసం అత్యంత శుభకరంగా భావిస్తూ తెల్లవారుజామునే హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. దంపతులు మండపంలో సత్యదేవుడి వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో 32 వ్రతాలు, 10 నిజాభిషేకాలు, 4 కల్యాణాలు జరిగాయని ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

'ఇంటర్‌సిటీ'కి హాల్ట్ ఇవ్వండి

వెల్దుర్తి(తూప్రాన్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శనివారం తపస్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిశారు. మాసాయిపేట (శ్రీనివాసనగర్) రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరే లోకల్ రైలును సాయంత్రం 4:20 గంటలకు వడియారం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరే విధంగా పొడిగించాలని వినతిపత్రం అందజేశారు. మాసాయిపేట జాతీయ రహదారి 44 పక్కన ఉన్న రైల్వేస్టేషన్ ద్వారా నిత్యం వందలాది ఉద్యోగులు, వర్తకులు, రోజువారి కూలీలు, పరిసర ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తారని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

'గజ్వేల్ స్పోర్ట్స్ విలేజ్' లేనట్టేనా!

- ఫుట్‌బాల్ స్టేడియం కోసం మంజూరైన రూ.2 కోట్లు రద్దు
- 20 ఎకరాల భూమి సేకరణ వృథా!
- మరుగున పడిన ప్రతిపాదనలు



గజ్వేల్‌లో 'స్పోర్ట్స్ విలేజ్' కోసం కేటాయించిన భూమి ఇదే

గజ్వేల్: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలనుకున్న 'గజ్వేల్ స్పోర్ట్స్ విలేజ్' రద్దయ్యింది. మరోవైపు స్పోర్ట్స్ విలేజ్‌లో అంతర్భాగంగా నిర్మించాలకున్నా ఫుట్‌బాల్ స్టేడియంకు రూ.2కోట్ల నిధులు మంజూరుకాగా అవి కూడా రద్దయ్యాయి. అప్పటికే 20 ఎకరాల భూమిని సేకరించి సిద్ధంగా ఉంచినా ఫలితం లేకుండా పోయింది. దీంతో క్రీడాకారుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. ఆ మేరకు కథనం...

మాజీ సీఎం కేసీఆర్ తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో అన్ని రంగాలతోపాటు క్రీడారంగం అభివృద్ధి జరగాలని సంకల్పించారు. గతంలో పట్టణంలో నిర్మించిన మినీ స్టేడియం వినియోగానికి నోచలేదు. పూర్తిస్థాయి సౌకర్యాల్లేక దానిని ఆర్‌టీఏ కార్యాలయానికి తాత్కాలికంగా కేటాయించారు. ఈ విషయం తెలుసుకున్న కేసీఆర్ మూడేళ్ల కిందటే పట్టణంలో కార్పొరేట్ హంగులతో 'స్పోర్ట్స్ విలేజ్' నిర్మించాలని ఆదేశాలిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం పట్టణంలోని షాదీఖానా సమీపంలో 560/1 సర్వే నంబర్‌లో 20 ఎకరాల భూమిని కేటాయించి స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించారు. ఈ మేరకు అధికారికంగా ఆదేశాలు కూడా వెలువడ్డాయి. ఇందులో అంతర్భాగంగా నిర్మించనున్న ఫుట్‌బాల్ కోర్టు కోసం ముందుగా రూ.2కోట్లు కూడా మంజూరు చేశారు. కాగా 'గజ్వేల్ స్పోర్ట్స్ విలేజ్' నిర్మాణానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నిధులతో ఇక్కడ అన్ని రకాల క్రీడల కోర్టులను నిర్మించాలకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని సిద్ధం చేస్తే భవిష్యత్‌లో జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఈ ప్రాంతాన్ని వేదికగా మార్చాలన్నది లక్ష్యం. ఇదే విషయాన్ని అధికారులు, నేతలు ప్రతీ సమావేశంలో ఊదరగొట్టారు. కానీ ఈ ప్రతిపాదనలకు సకాలంలో ఆమోదం లభించలేదు. ఇక నియోజకవర్గంలోని ములుగు, తూప్రాన్‌లలో మినీస్టేడియంల నిర్మాణానికి రూ.5కోట్ల చొప్పున నిధులు మంజూరు ప్రతిపాదనలున్నాయి. ఇవేకాకుండా 'రీజినల్ రింగు రోడ్డు'కు సమీపంలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సైతం ప్రతిపాదలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిన దృష్ట్యా నగరానికి ప్రత్యామ్నాయంగా గజ్వేల్‌ను ఎంచుకుంటున్నారు. రీజినల్ రింగు రోడ్డు పూర్తయితే దేశ, విదేశాల నుంచి క్రీడాకారులు ట్రాఫిక్ చిక్కుల్లేకుండా నేరుగా ఇక్కడి చేరుకునే అవకాశముంటుంది. అంతర్జాతీయ క్రీడలకు ఈ ప్రాంతం వేదికగా మారి, ప్రపంచ చిత్ర పటంలో గజ్వేల్ పేరు మారుమోగే అవకాశముంటుందని భావించారు. కానీ ఈ ప్రతిపాదనలన్నీ మరుగునపడ్డాయి. ప్రస్తుతం ఫుట్‌బాల్ స్టేడియం కోసం వచ్చిన నిధులు కూడా రద్దయ్యాయి. దీనిని బట్టి 'స్పోర్ట్స్ విలేజ్' ఇక లేనట్టే అనే విషయం స్పష్టమవుతోంది. దీంతో ఇంతకాలం వేచి ఉన్న క్రీడాకారుల్లో ఒక్కసారిగా నిరాశ అలుముకుంది. క్రీడారంగంలో గజ్వేల్ హైదరాబాద్‌కు దీటుగా వేదికగా మారుతుందని భావిస్తే అంచనాలు తారుమారు కావడంతో ఆందోళన చెందుతున్నారు.

క్రీడాకారుల ఆశలు నెరవేరదెప్పుడు?



గజ్వేల్‌కు 'స్పోర్ట్స్ విలేజ్' మంజూరైందంటూ అప్పట్లో అధికారులు, నాయకులు ఊదరగొట్టారు. కానీ ఏళ్ల గడిచినా ఈ కల నెరవేరలేదు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు కూడా రద్దయ్యాయి. 20 ఎకరాలు భూమిని సేకరించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ఈ సేకరించిన భూమికి కంచె ఏర్పాటు చేయాలి. అలాగే మినీస్టేడియంను ఇక్కడి నుంచి తరలించి ఈ ప్రాంగణాన్ని యువజన సర్వీసుల శాఖకు అప్పగించాలి.

- దేశబోయిని నర్సింహులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత

క్లుప్తంగా

మొక్కలు నాటండి



మొక్క నాటుతున్న రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, పర్యావరణ పరిక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, టౌన్ ఎస్ఐ కాశీనాథ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎల్లయ్య, తదితరులు

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో విధులు నిర్వహించే పంచాయతీ (జీపీ)కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీపీ కార్మికులకు 10 నెలలుగా పంచాయతీల్లో సబ్బులు, నూనెలు, గ్లౌజులు, మాస్కులు, శానిటైజర్ ఇవ్వడం లేదన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు విజృంభిస్తున్న ఈ తరుణంలో ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తూ, మురికి కాల్వలు, రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికుల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని మండిపడ్డారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు నర్సింలు, దేవయ్య, సుజాత, నర్సవ్వ, రామచంద్రం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

పీసీసీ ఉపాధ్యక్షుడు రాములు నాయక్



మాట్లాడుతున్న రాములు నాయక్

పటాన్‌చెరు టౌన్: కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్మిక కర్షక కాంగ్రెస్ యూనియన్ అధ్యక్షుడు రాములు నాయక్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో సువిన్ ఫార్మా యూనియన్ ఆధ్వర్యంలో 9వ రోజు కార్మికులు చేపడుతున్న నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను యాజమాన్యం ఒప్పుకునేంత వరకు ఈ నిరసన కొనసాగుందన్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ రాజు ముదిరాజ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భర్త దాడిలో భార్యకు గాయాలు

సిద్దిపేటకమాన్: కుటుంబ కలహాలతో భర్త భార్యపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నీలం రాజు, సరిత దంపతులు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి మరోసారి గొడవ జరుగగా రాజు ఇంట్లోని రొట్టెల పీటతో సరిత మొహంపై దాడి చేసి గాయపర్చాడు. అనంతరం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి పోయాడు. రక్తపు మడుగులో సరిత ఆర్తనాదాలను గమనించిన ఇరుగు పొరుగు వారు 108కు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు రాజు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నంగునూరు(సిద్దిపేట): మల్లయ్య ఇచ్చిన స్థలంలో నిర్మించిన హాస్టల్

సిద్దిపేట శ్రీమంతులు

పల్లెను తలచి.. సేవలో తరించి..

సొంతూరు రుణం తీర్చుకుంటున్నారు

సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారస్తులు, విశ్రాంత ఉద్యోగులు



చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాలలో పూర్తికావొచ్చిన గ్రంథాలయం

విశ్రాంత ఉద్యోగుల సాయం..



చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట) : బెజ్జంకి మండలంలో చీలాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలలో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించేందుకు గ్రామస్తులతోపాటు విశ్రాంత ఉద్యోగులు సమష్టిగా ఆర్థిక సాయం అందించారు. పాఠశాల హెచ్‌ఎంకు రూ.45 వేలు సాయంను అందించారు. విద్యార్థులకు బోధనకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా విద్యావలంటీర్ల నియామకం కోసం ఉపయోగించనున్నారు.

పూర్వ విద్యార్థులు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

బెజ్జంకి మండలం వడ్లూరు బేగంపేట జెడ్పీఎస్ఎస్ 2006–2007 పదో తరగతి విద్యార్థులు తమ ఉదారతను చూపారు. విద్యార్థులకు తాగునీటిని అందించాలని ఉద్దేశ్యంతో ఆర్‌ఓ ప్లాంట్‌కు తమ వంతు సాయం చేశారు.

చలిమెడ ఫీడ్స్ ఆధ్వర్యంలో వైకుంఠ రథం



వైకుంఠ రథాన్ని అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు

మండలంలోని తోటపల్లి గ్రామానికి చలిమెడ ఫీడ్స్ అధినేత చలిమెడ వెంకటేశ్వర్‌రావు వైకుంఠ రథాన్ని అందజేశారు. సమాజంలో ప్రజలకు అవసరమైన వసతుల కల్పన కోసం సుమారు రూ.15 లక్షలతో తయారు చేయించి ఇచ్చారు. గతంలోనూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.50 లక్షలతో అదనపు తరగతి గదిని నిర్మించారు. గ్రామ పరిధిలోని చల్మెడ ఫీడ్స్‌లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించారని మాజీ సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు తెలిపారు.

సేవలో బాలమల్లయ్య భళా..



ఉన్నత పాఠశాలలో నిర్మించిన షెడ్డు

నంగునూరు(సిద్దిపేట): పుట్టిన ఊరికి ఏదైనా చేయాలనే తపన.. కన్న తల్లిదండ్రుల పేరు కలకాలం గుర్తుండి పోవాలనే తపనతో ఊరికి ఉపకారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నంగునూరు మండలం గట్లమాల్యాలకు చెందిన చెలిమిల్ల బాలమల్లయ్య. వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో ఏ కార్యక్రమం నిర్వహించినా ముందుంటూ ఆర్థిక సహాయం అందించి ఆసరాగా నిలుస్తున్నాడు. కరోనా నేపథ్యంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందించడమే కాకుండా ఎంతో మందికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. చిన్న తనంలో హాస్టల్‌లో ఉండి చదివిన బాలమల్లయ్య విద్యాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తూ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రూ.2 లక్షలతో భోజన షెడ్డు నిర్మించారు. గ్రామంలోని బాలికల ఎస్సీ హాస్టల్‌కు పక్కా భవనం లేకపోవడంతో తన తల్లిదండ్రులు చెలిమిల్ల పెద్ద కొమురయ్య, లక్ష్మి పేరిట ఉచితంగా స్థలాన్ని అందజేయగా పక్కా భవనం నిర్మాణం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామానికి పశువుల హాస్టల్ మంజూరి కాగా సొంత డబ్బులు వెచ్చించి 2 ఎకరాల భూమి ఉచితంగా గొల్ల కుర్మలకు అందజేశారు. దైవ భక్తి కల్గిన బాలమల్లయ్య గ్రామంలో నిర్మించిన ప్రతీ ఆలయానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ సేవ చేయాలి



పుట్టి పెరిగిన ఊరిలో నా తల్లిదండ్రులు కొమురయ్య, లక్ష్మి పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలనే తపనతో గ్రామానికి అన్ని విధాల సాయం చేస్తున్నా. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలిచి గ్రామానికి తోచిన సహాయం చేయాలి. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు సేవా చేస్తూ వృద్ధాప్యంలో అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

– చెలిమిల్ల బాలమల్లయ్య.

స్కూళ్ల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్లు



ముస్త్యాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన పెడతల ప్రతాప్ రెడ్డి 47 ఏళ్ల కిందట అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పుట్టిన ఊరికి ఏదైనా చేయాలన్న ఉద్దేశ్యంతో 20 ఏళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదట గ్రామంతోపాటు అప్పటి ఉమ్మడి మండలం చేర్యాలలోని చుంచనకోట, అయినాపూర్ గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసి అప్పటి వరంగల్ ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. తర్వాత గ్రామంలోని పాఠశాలలో రూ.లక్ష ఖర్చుతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. రూ.6 లక్షల వ్యయంతో ముస్త్యాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో రెండు తరగతి గదులు నిర్మించారు. రూ.9 లక్షల వ్యయంతో ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఐదేళ్ల కిందట హైస్కూల్, ప్రైమరీ స్కూల్ పేరిట ఎస్‌బీఐ బ్యాంకులో రూ.15 లక్షలు డిపాజిట్ చేశారు. ప్రస్తుతం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన లైబ్రరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేసి ప్రారంభించనున్నారు. అలాగే పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, మూత్రశాల మరమ్మతులు చేయించి బెంచీలు అందించారు.

పేద విద్యార్థుల కోసమే..



మా ఊరిలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉద్దేశ్యంతో నాకు తోచిన సాయం చేస్తున్నా. నా ఊరు వాళ్లు నేను ఇంటికి వచ్చినప్పుడు ఏదైనా సాయం కావాలని కోరితే ఏదో విధంగా ఆదుకుంటా. పాఠశాలలో ఆర్థిక అవసరాలకు ఇబ్బంది పడొద్దని రూ.15 లక్షల డబ్బులను ఫిక్స్‌డ్ చేశాను. వాటికి వచ్చిన వడ్డీతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

– పెడతల ప్రతాప్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

ఎన్‌ఆర్‌ఐలు.. అభివృద్ధిలో అన్నాదమ్ముళ్లు



జక్కాపూర్ పాఠశాలలో కొనసాగుతున్న డైనింగ్ హాల్ నిర్మాణం

సిద్దిపేట రూరల్(సిద్దిపేట): నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు దొంతుల సుధాకర్, దొంతుల రాములు గ్రామానికి వారి వంతుగా సహకారాన్ని అందించారు. గ్రామ ఉన్నత పాఠశాలలో చదివే పిల్లల కోసం సుధాకర్ రూ.30 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించి వేతనాలు అందించారు. రాములు పాఠశాల విద్యార్థుల కోసం ప్రొజెక్టర్, పలు విద్యా సామగ్రి అందించారు. అదే విధంగా గ్రామంలో రామాలయం, శివాలయం, వాటర్ ప్లాంట్ నిర్మాణం వంటివి అభివృద్ధి పనులు చేపట్టారు.

రూ.16 లక్షలతో గ్రంథాలయం



గుర్రాలగొందిలో నిర్మించిన గ్రంథాలయం

నారాయణరావు పేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామానికి చెందిన రాయి గంగారాం అమెరికాలో 30 ఏళ్లుగా స్థిరపడ్డాడు. ఈ క్రమంలో గ్రామానికి తన వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామ యువకుల కోసం రూ.16 లక్షలతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. అదే విధంగా మరో ఎన్‌ఆర్‌ఐ గరిపల్లి రామ్మోహన్ పాఠశాలలో పలు కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.1.60 లక్షల వ్యయంతో దయాజ్ (వేదిక)ను నిర్మించాడు.

20 ఏళ్ల నుంచి సేవ చేస్తున్నాం



పుట్టిన ఊరిపై ఉన్న మక్కువతో గ్రామానికి సేవ చేస్తున్నాం 20 ఏళ్లుగా గ్రామంలో తమకు తోచినంతగా కుటుంబం సాయంతో సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాం. ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్ అవసరం ఉందని గ్రామస్తులు, ఉపాధ్యాయుల కోరడంతో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టాం. అదే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణం చేస్తున్నాం. గ్రామానికి సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో తన వంతుగా గ్రామానికి మరింతగా సేవ చేసుకుంటాం.

– దొంతుల సుధాకర్, ఎన్‌ఆర్‌ఐ, జక్కాపూర్

బంధువుల పెళ్లికి వెళ్తుండగా...

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ
- తీవ్రగాయాలై వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అంబర్య కథనం మేరకు.. హస్నాబాద్‌కు చెందిన దత్తు(45) 30 ఏళ్లుగా బాలానగర్‌లో ఉంటున్నాడు. హస్నాబాద్‌లో బంధువుల ఇంట్లో పెళ్లి కోసమని దత్తు బైక్‌పై బయలు దేరాడు. 65వ నంబర్ జాతీయ రహదారి వెళ్తుండగా పటాన్‌చెరు మండలం ముత్తంగి హరి దోశ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా 108 సాయంతో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నీటి ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆటో



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

టేక్మాల్ (మెదక్): రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలైన ఘటన టేక్మాల్ మండలంలోని బోడ్మట్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. 161 హైవే సిబ్బంది రోడ్డు మధ్యలో చెట్లకు ట్యాంకర్ ద్వారా నీటిని పడుతున్నారు. జోగిపేట నుంచి అల్లాదుర్గం వైపుగా అతివేగంతో అజాగ్రత్తగా వస్తున్న ఆటో ఆగిన ఉన్న నీటి ట్యాంకర్‌కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీటిని పడుతున్న శ్రీనివాస్‌కు కాలు విరుగగా, అల్లాదుర్గం మండలం పోతులబొగుడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శివరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు ట్యాంకర్ డ్రైవర్, ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో ట్యాంకర్‌లో ఇరుక్కొని నుజ్జునుజ్జు అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

లారీ బీభత్సం

గొర్రెల మందపై దూసుకెళ్లడంతో 15 జీవాలు మృతి



గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొడకండ్ల వద్ద శనివారం చోటు చేసుకుంది. కుకునూర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన కోరె మల్లయ్య, బీడ భూమయ్యలు తమ గొర్రెలను మేత కోసం తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ రహదారిని దాటుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంట్, కాంక్రీట్ మిక్చర్ లారీ మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడున్నర లక్షల విలువైన 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 20 గొర్రెలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సందర్భంగా గొర్రెల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్యాంకులో పడి ఐదు వానరాలు మృతి

ఆలస్యంగా వెలుగులోకి..



ట్యాంకులో మృతి చెందిన వానరాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి సాయిబాబా గుడి వెనుక వైపు నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులో పడి ఐదు వానరాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుర్వాసన రావడంతో మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య ట్యాంకులో చూడటంతో ఐదు వానరాలు చనిపోయి కనిపించాయి. 15 రోజుల కిందటే మరణించినట్లు భావిస్తున్నారు. వాటిని బయటకు తీసి ఖననం చేశారు. కార్యక్రమంలో బొనగం లక్ష్మీనారాయణ, అంజయ్య, బాలయ్య, పూజారి యోగేంద్రశర్మ, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి రిమాండ్



సమావేశంలో సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: అత్యాచార ఘటన కేసులో పోలీసులు శనివారం నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. ఈ నెల ఒకటో తేదీన మండలంలోని పందిళ్ల గ్రామంలో తల్లిదండ్రులు పనికిపోవడంతో ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న యువతికి మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. నిందితుడు తాదూరి అశోక్‌ను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై తోట మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



రాజు మృతదేహం

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ రావు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణి నగర్ కాలనీలో బిల్డర్ అశోక్ నిర్మిస్తున్న విల్లాలకు శ్రీనివాస్ అనే వ్యక్తి లేబర్ కాంట్రాక్టర్ తీసుకొని పనులు చేస్తున్నాడు. శనివారం చందానగర్‌కు చెందిన ఎద్దుల రాజు(42)తోపాటు మరి కొంతమంది కూలీలతో పని చేయిస్తున్నాడు. రాజు స్లాబ్ వేయడానికి కావాల్సిన ఇనుప నిచ్చెన ఫిట్ చేసి పైనుంచి కిందికి దిగుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైరు తగిలి కింద పడిపోయాడు. వెంటనే చికిత్స కోసం బాచుపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బిల్డర్ అశోక్, లేబర్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో తన భర్త మృతి చెందాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నకిలీ విత్తనామా.. పిచికారీ ప్రభావమా!



పత్తి పంటను చూపుతున్న రైతు నవీన్

- నాలుగు ఎకరాల పత్తి పంట నాశనం
- ఆకులన్నీ ముడత, కాతపూత లేని వైనం
- ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): నకిలీ విత్తన ప్రభావమో లేదా మందుల పిచికారీ ప్రభావమో తెలియదు గానీ పత్తి పంట మొత్తం ముడతపోతుంది. వివరాల్లోకి వెళ్తే.. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన ఎనకపల్లి నవీన్ అనే రైతు తమకున్న రెండు ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాగానే ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటరమణ ట్రేడర్స్ దుకాణంలో సదానంద్‌పత్తి విత్తనాలను పది ప్యాకెట్లను రూ.8,640 చెల్లించి కొనుగోలు చేశారు. ప్రస్తుతం పత్తి పంట మొత్తం ఆకులన్నీ ముడత రావడం, పూత కాత లేకపోవడంతో అనుమానం వచ్చిన రైతు నవీన్ దుకాణం డీలర్ దగ్గరకు వెళ్లి పత్తి ఆకులను చూపించారు. డీలర్ మందు పిచికారీ చేస్తే పోతుందని రసం పీల్చే మందు ఇచ్చారు. మందు పిచికారీ చేసి పది రోజులు గడుస్తున్నా ఫలితం లేదని, నకిలీ విత్తనాలతో మోసపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి డీలర్‌కు చెబితే తమదేమి లేదని పొంతన లేని సమాధానం చెప్పినట్లు వాపోయారు. అలాగే మండల వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకపోయాయని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై ఏఓ వసంతరావును వివరణ కోరగా రైతు వేసిన పత్తి పంట ఆకులన్నీ ముడత వచ్చింది వాస్తవమేనని, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకుపోయి రైతుకు న్యాయం చేసేలా చూస్తామని తెలిపారు. రైతులు మందుల పిచికారీ అతిగా చేయొద్దని పేర్కొన్నారు.

రూ.70 వేలు పెట్టుబడి పెట్టిన..

వేసిన నాలుగు ఎకరాల్లో పత్తి పంట ముడత బారిపోయింది. భూమిని కౌలుకు పట్టుకొని సాగు చేసిన. దాదాపుగా రూ.70 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన. ప్రస్తుతం పంటను చూస్తుంటే కష్టంతో పాటు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి.

– నవీన్, రైతు తిగుల్

'పుంజాల' సేవలు మరువలేనివి



పుంజాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి జస్టిస్ స్వర్గీయ పుంజాల శివశంకర్ సేవలు మరువలేనివని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి జగపతి కొనియాడారు. జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో భారత సామాజిక న్యాయ శిఖరం, రిజర్వేషన్ల పితామహుడు పుంజాల శివశంకర్ 95వ జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జగపతి మాట్లాడుతూ.. ప్రజల కోసం పోరాడే తత్వం, అన్యాయాన్ని అక్రమాలను ధిక్కరించే నైజం ఉన్న నాయకుడన్నారు. శివశంకర్ ఏవిధంగా జీవించాలో తెలిసిన మనిషి, మరణానికి కూడా ఒక అర్థవంతమైన జీవితాన్ని ఇచ్చిన మహా మనిషి అన్నారు. నేటి తరం యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్ కుమార్, రాష్ట్ర నాయకులు నారాయణ, కో ఆర్డినేటర్ వీర్ కుమార్, జిల్లా నాయకులు హర్కార్ మహిపాల్, యాదగిరి, పట్టణ అధ్యక్షుడు గట్టేష్, అనిల్, శ్రీనివాస్, యూత్ నాయకులు నర్సింలు, శివ కుమార్, విజయ్, గందె రవి, వినోద్ కుమార్, అవినాష్, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.